ప్రజాశక్తి
బుధవారం 19 మార్చి 2025 5 విజయనగరం

జాబ్‌మేళాకు 546 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మహారాజా స్కూలు ఆఫ్ మేనేజ్‌మెంట్ కోట క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన సంకల్ప మెగా జాబ్ మేళాలో 546 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 26 కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు జిల్లా వ్యాప్తంగా 1542 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.13వేలు నుంచి రూ.60వేల వరకు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎన్ రాజుమాట్లాడుతూ , చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివద్ధి పరచుకోవాలని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి అరుణ, స్కిల్ డెవలప్మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి టి. భాస్కర్, ఎంప్లాయిమెంట్ యుంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్ సీ డాప్ సిబ్బంది పాల్గొన్నారు.

మారిక పాఠశాల వద్ద విద్యార్థులతో గ్రామపెద్దలు, సిపిఎం నాయకులు

- పాఠశాలకు ఎగనామం పెడుతున్న ప్రధానోపాధ్యాయుడు
- కానరాని ఎంఇఒల పర్యవేక్షణ
- మరో ఉపాధ్యాయుడి సెలవుతో మూతపడిన పాఠశాల
- సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో బయటపడిన భాగోతం
- హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని మారిక గ్రామస్తుల డిమాండ్

ఆ ఉపాధ్యాయుడికి నెలకొకరోజే బడి

ప్రజాశక్తి-వేపాడ

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు పాఠశాలకు నెలలు తరబడి డుమ్మా కొడుతున్నాడు. నెలలో ఏదో ఒకరోజు మాత్రమే పాఠశాలకు వెళ్లి..రిజిస్టర్‌లో నెలంతా సంతకాలు పెట్టేసి ముఖం చూపించి వెళ్లిపోవడంతో ఆ పిల్లల చదువులు గాలిలో కలసిపోతున్నాయి. కొండపైనున్న ఆ పాఠశాలను అధికారులెవరూ పరిశీలించరని అనుకున్నాడో, తెలిసినా ఏమీ చేయలేరని భావించాడో గాని చిన్నారులకు చదువు చెప్పకుండా ప్రభుత్వం నుంచి ఏంచక్కా..ప్రతినెలా జీతం తీసుకుంటున్న ఉపాధ్యాయుడి ఉదంతం తాజాగా వెలుగు చూసింది. సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ప్రజాచైతన్యయాత్రలో భాగంగా పలు సంఘాల నాయకులు గ్రామంలో బస చేయడంతో ఈ విషయం బయటపడింది.

ఎస్.కోట పట్టణానికి సుమారు 12కిలోమీటర్ల దూరాన గల కరకవలస పంచాయతీ మారిక గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 28మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే వీరికి విద్యనేర్పాల్సిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వి శ్రీకాంత్ పూర్తిగా పాఠశాలకు డుమ్మా కొడుతున్నాడు. నెలకొకరోజు మాత్రమే పాఠశాలకు వెళ్లి రిజిస్టర్‌లో అన్ని రోజులకూ సంతకాలు పెట్టేసి వెళ్లిపోతున్నాడు. జీతం మాత్రం ప్రభుత్వం నుంచి ప్రతినెలా తీసుకుంటున్నాడు. ఆఖరుకు ఆగస్టు 16, రిపబ్లిక్ వంటి ముఖ్య దినాల్లోనూ పాఠశాలకు వెళ్లడం లేదు. అప్పుడప్పుడూ వచ్చి సంతకాలు పెట్టేసి వెళ్లిపోతారని గ్రామస్తులు చెబుతున్నారు. మరో ఉపాధ్యాయుడు ఉన్నప్పటికీ అనారోగ్యం కారణంగా సెలవులో ఉండడంతో పాఠశాల మూతపడింది. గ్రామంలో పాఠశాల కూడా శిథిలావస్థలో ఉండడంతో ఓ ప్రైవేటు భవనంలో నడుపుతున్నారు. మండలంలో ఇద్దరు ఎంఇఒలు ఉన్నప్పటికీ పర్యవేక్షణ కొరవడడంతో పాఠశాలల నిర్వహణ అధ్వానంగా తయారైంది. హెచ్‌ఎం శ్రీకాంత్ పాఠశాలకు రానప్పటికీ ఎంఇఒలను మేనేజ్ చేసుకొని జీతం పొందుతున్నట్లు తెలిసింది.

ప్రజా సంఘాల నాయకుల వద్ద గ్రామస్తులు మొర

సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్యయాత్రలో భాగంగా గ్రామంలో సమస్యలు తెలుసుకునేందుకు రైతు సంఘం నాయకులు చల్లాజగన్, సిపిఎం నాయకులు చలుమూరి శ్యామ్ పర్యటించారు. సోమవారం రాత్రి గ్రామంలోనే బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడేఉన్నారు. కానీ ఈ రెండురోజులూ పాఠశాల తెరుచుకోలేదు. గ్రామస్తులను ఆరా తీయడంతో చాలా రోజులుగా పాఠశాల మూతపడిందని, హెచ్‌ఎం శ్రీకాంత్ పాఠశాలకు రావడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఆఖరుకు ఆగస్టు 15, రిపబ్లిక్‌డే నాడు కూడా హెచ్‌ఎం శ్రీకాంత్ రాలేదని చెప్పారు. తమ పిల్లలకు చదువు చెప్పేవారే కరువయ్యారని ఆవేదన చెందారు. హెచ్‌ఎం శ్రీకాంత్ పాఠశాలకు నెలలో ఒకరోజు వచ్చి అన్ని రోజులూ వచ్చినట్లు సంతకాలు పెట్టేస్తారని, ఎంఇఒకు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ స్కూలుకు వెళ్లకుండా జీతం తీసుకుంటున్న టీచర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంటనే కలుగజేసుకొని అతనిని సస్పెండ్ చేసి పనిచేయని కాలం మొత్తానికి జీతం రికవరీ చేయాలని డిమాండ్‌చేశారు. అమాయక గిరిజన పిల్లల చదువుతో ఆటలాడు కోవడం అన్యాయమన్నారు వెంటనే ఇంకో ఉపాధ్యాయుడిని నియమించి గిరిజన పిల్లలను ఆదుకోవాలని కోరారు.సిపిఎం నాయకులకు వినతినిచ్చిన వారిలో గ్రామ పెద్దలు కిల్లో ఆనంద్, జి.బాబురావు, అప్పలనాయుడు, రామకృష్ణ, ఎస్.ఆసు ఉన్నారు.

ఇళ్ల స్థలాల కోసం కదిలిన పేదలు

- సిపిఎం ఆధ్వర్యాన తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా
- సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం
- సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నివాసం ఉన్న చోట జీవో 30 ప్రకారం రెగ్యులర్ చెయ్యాలని, ఇళ్లు లేని పేదలకు 2 సెంట్లు భూమి ఇచ్చి 5లక్షలు మంజూరు చెయ్యాలని, టిడ్కో ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని పేదలు కదం తొక్కారు. సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు మీదుగా తహాశీల్దార్ కార్యాలయం వరకు పేదలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధిక సంఖ్యలో పేదలు తరలిరావడంతో తహాశీల్దార్ ధర్నా వద్దకు వచ్చి సిపిఎం నాయకులు ఇచ్చిన వినతిపత్రం, పేదలు ఇళ్ల కోసం ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వం పట్టణాల్లో పేదల కు 2 సెంట్లు భూమి ఇస్తామని చెప్పిందని, వెంటనే అమలు చేయాలని కోరారు. నగరంలో చాలా మంది పేదలకు ఇళ్లు లేక, అద్దెలు కట్టుకోలేక, పెరిగిన నిత్యవసర ధరలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరోవైపు విద్యుత్ భారాలు పెరిగిపోతున్నాయన్నారు. పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. సిపిఎం నాయకులు పి.రమణమ్మ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, మార్చి 31నాటికి ఇళ్లు పూర్తి కాకపోతే రద్దు చేయాలనే ఆలోచన విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ, ఆర్.ఆనంద్, ఆర్.శ్రీనివాసరావు, ఎం.శాంత మూర్తి, స్థానిక నాయకులు సత్యం,పట్టణ పేదలు పాల్గొన్నారు.

కోట జంక్షన్ నుంచి తహాశీల్దార్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు

తహాశీల్దార్‌కు ఇళ్ల దరఖాస్తులు అందజేస్తున్న సిపిఎం నాయకులు

క్వారీతో మా ప్రాణాలకు ప్రమాదం

ధర్మవరం క్వారీ వద్ద గ్రామస్తుల ఆందోళన

పేలుడు పదార్థాలు తెచ్చిన వ్యాన్ అడ్డగింత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

క్వారీ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మండలంలోని ధర్మవరం రెవెన్యూ పరిధిలో ఉన్న క్వారీ వల్ల తమ ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ధర్మవరం గ్రామస్తులు క్వారీ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ క్వారీ వలన తాము పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ గాలి సన్యాసయ్య, విఆర్‌ఒ సుధీర్ ఆధ్వర్యంలో వివరించారు. ధర్మవరం గ్రామ మహిళలు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఈ క్వారీని ఏర్పాటు చేశారని అప్పటినుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున బ్లాస్టింగులు చేయడం వలన తమ పొలాలు పండడం లేదని వాపోయారు. తమ పొలాల వద్ద తాము ఉన్న సమయంలో తమకు ఏ మాత్రం హెచ్చరికలు చేయకుండా పేలుళ్లు నిర్వహిస్తున్నారని, దీనివలన తమ ప్రాణాలు పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. క్వారీలో నిబంధనల ప్రకారం బ్లాస్టింగ్ నిర్వహించాల్సి ఉండగా 90 అడుగులు మేర గోతులు తీసి అక్రమంగా పేలుళ్లు నిర్వహిస్తున్నారని దీనివల్ల తమ పొలాలతో పాటు ఇల్లులు దెబ్బతింటున్నాయని చెప్పారు. పలుమార్లు అధికారులకు చెప్పిన మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో వారి పేలుళ్లకు సంబంధించి మందు గుండు తీసుకొచ్చిన వ్యాన్ ను స్థానికులు అడ్డుకున్నారు. అందులో ఉన్న పేలుడు పదార్థాల డబ్బాలను చూపించారు. ఈ డబ్బాలలో జిలెటిన్ స్టిక్స్.. ఇతర ప్రమాదకరమైన మందు గుండు ఉండవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకొని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై సర్పంచ్ గాని సన్యాసయ్య, విఆర్‌ఒ సుధీర్ మాట్లాడుతూ ఈ పేలుళ్ల సంబంధించిన వ్యానులు పోలీసులకు అప్పగిస్తామని తెలిపారు.

ఉపాధి కల్పనలో వెనుకబాటు

- లక్ష్యం చేరుకోని పనిదినాలు
- పనులు దొరక్క అవస్థలు పడుతున్న కూలీలు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సంవత్సరం	లక్ష్యం (పనిదినాలు)	సాధించిన (పనిదినాలు)
2024-25	1.81కోట్లు	1.70 కోట్లు
2023-24	2.10కోట్లు	2.18 కోట్లు
2022-23	1.86 కోట్లు	1.95 కోట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉపాధి కల్పనలో విజయనగరం జిల్లా వెనుక బడడం బహుశా చరిత్రలో ఇదే తొలిసారి. ఏటా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్న జిల్లా తాజాగా రెండో స్థానంలో నిలిచింది. కనీసం లక్ష్యాన్ని కూడా చేరుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పనులు దొరక్క కూలీలు అవస్థలు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో వీరి వెతలు వర్ణణాతీతం. కమ్యూనిస్టుల ఒత్తిడితో 2024లోని యుపిఎ-1 మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం ఏటా వంద రోజులు పని గ్యారెంటీగా కల్పించాలి. 14రోజుల్లోపు వేతనాలు చెల్లించాలి. సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం చెల్లించాలి. చెల్లింపుల్లో జాప్యం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఈ చట్టంలో అత్యంత కీలకమైన ఈ రెండూ అమలు కావడం లేదు. జిల్లాలో ఉపాధి గ్యారెంటీ జాబ్ కార్డులు 3.84లక్షల వరకు ప్రభుత్వం జారీ చేసింది. వీటి పరిధిలో 6.84మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇందులో 3.53 జాబ్‌కార్డుల ద్వారా 5.94 మంది కూలీలు పూర్తిగా ఈ ఉపాధి హామీ పనుల ఆధారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇందులో సుమారు 54వేల వరకు దళిత, గిరిజన కుటుంబాలు కాగా, మిగిలినవారంతా భూమి లేని ఇతర సామాజికవర్గాలకు చెందినవారు ఉన్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో అత్యధిక కుటుంబాలవారికి ఉపాధి పనులే జీవనాధారం అని వేరేగా చెప్పనక్కర్లేదు. ఈనేపథ్యంలోనే ఉపాధి పనులు వినియోగించు కోవడంలో మన జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉంటోంది. తద్వారా పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచీ జిల్లా కలెక్టర్లు, డ్వామా అధికారులు ఎన్నో అవార్డులు, రివార్డులు ఢిల్లీ స్థాయిలో అందుకున్నారు. ఈఏడాది 1.81కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1.70కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించినట్లు సాక్షాత్తు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. మిగిలిన 11కోట్ల పనిదినాల కల్పనకు ఈనెల 31వరకు మాత్రమే సమయం ఉంది. గడిచిన రెండేళ్ల పరిస్థితి ఒక్కసారి పరిశీలిస్తే 2023-24లో 2.10కోట్ల పనిదినాలు లక్ష్యం పెట్టుకోగా 2.18కోట్ల పనిదినాలు కల్పించారు. 2022-23లో 1.86కోట్ల పనిదినాలకుగాను 1.95కోట్ల పనిదినాలు కల్పించారు. అంతకు ముందు పథకం అమల్లోకి వచ్చింది మొదలు ఏటా ఎంతో కొంత లక్ష్యానికి మించే పని దినాలు కల్పించినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పరిస్థితి ఇలా ఉండగా గ్రామాల్లో పనులు దొరక్క కూలీలు అవస్థలు పడుతున్నారు. వంద రోజులు పనిచేయనివారు జిల్లాలో ఇంకా సగం మంది కూలీలు ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

అక్షరాస్యతా పరీక్షకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 23వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ప్రాథమిక అక్షరాస్యతా పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేయాలని డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, వయోజన విద్య డిడి ఎ.సోమేశ్వర్రావు కోరారు. స్థానిక డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి సోమేశ్వర్రావు మాట్లాడుతూ, ఉల్లాస్-నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు మధ్య లబ్ధిదారులకు వారికి వీలైన సమయంలో 3 గంటల పాటు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, లేదా వారికి అనువైన స్థలాల్లో పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించి, జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ ద్వారా అధికారిక ధ్రువీకరణ పత్రాలను పొందాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ జి.ప్రసన్న, వయోజనవిద్య ఎఒ సిహెచ్‌ఆర్‌సి ధనలక్ష్మి , సిడిపిఒలు, వెలుగు ఎపిఎంలు పాల్గొన్నారు.

ఎఒలను డిప్యూటీ ఎంపిడిఒలుగా మార్చాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న పరిపాలన అధికారులను డిప్యూటీ ఎంపిడిఒ(పరిపాలన)లుగా మార్పు చేయాలని కోరుతూ జెడ్‌పి సిఇఒకు మంగళవారం పంచాయతీరాజ్ ఉద్యోగులు, ఎపిఎన్‌జిఒ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఇటీవల పంచాయతీరాజ్ శాఖ లో పోస్టులను రీ ఆర్గనైజేషన్ చేస్తూ ఇఒపిఆర్‌డిని డిప్యూటీ ఎంపిడిఒగా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. అదే సమయంలో మండల పరిషత్ లో వున్న పరిపాలన అధికారులను కూడా డిప్యూటీ ఎంపిడిఒ (పరిపాలన) గా మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మురళి, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పిఎమ్ రవి కుమార్, ఎపి ఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ కుమార్, రాజ్ కుమార్,వర్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న జెసి సేతు మాధవన్, సర్వశిక్ష ఎపిసి రామారావు, డిఇఒ

జూడో విజేతలకు జెసి అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జూడో పోటీల్లో విజేతలుగా నిలిచిన నెల్లిమర్ల కెజిబివి కి చెందిన విద్యార్థినులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తమ ఛాంబర్లో మంగళవారం అభినందించారు. ఈనెల 9న స్థానిక విజ్జీ స్టేడియంలో జూడో ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో నెల్లిమర్ల కెజిబివి కి చెందిన 8 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు 15,16 తేదీల్లో విజయవాడ ఐజిఎంసి స్టేడియంలో జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. వీరిలో జిల్లాకు చెందిన వై.అనూష 52 కిలోల విభాగంలో రెండోస్థానంలో, పి.జ్యోత్స్నారాణి తృతీయ స్థానంలో నిలిచారు. బి.భార్గవి 63 కిలోల విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. 70 కిలోల విభాగంలో పి.సత్య కూడా ద్వితీయ స్థానంలో నిలిచారు. వై.అనూష జాతీయ పోటీలకు సైతం ఎంపికయ్యింది. వీరిని జెసి సేతుమాధవన్ అభినందించి, మరిన్ని విజయాలను సాధించి జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో డిఇఒ మాణిక్యం నాయుడు, సర్వశిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు, జిసిడిఒ మాలతి, నెల్లిమర్ల కెజిబివి ప్రిన్సిపాల్ బి.ఉమ, పీడీ ఎస్.రమ తదితరులు ఉన్నారు

ఎంత కష్టం... ఎంత కష్టం

- ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్‌కల్యాణ్ ఫొటో పెట్టాలని బలవంతం
- జనసైనికుల ఒత్తిడితో అడకత్తెరలో అధికారులు
- జిఒ లేకుండా ఎలా పెడతారంటున్న తెలుగు తమ్ముళ్లు

ప్రభుత్వ కార్యాలయంలో పవన్ కల్యాణ్ ఫొటో పెడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! అటు జనసైనికులకు ఇటు జిల్లా స్థాయి అధికారులకు పెద్ద కష్టమే వచ్చింది. ఒక్క జీవోతో అమలు జరిగిపోవాల్సిన పనిని, అధికారులపై ఒత్తిడిచేసి పని చేయించుకుంటున్నారు. జీవో లేకపోవడంతో అధికారులు కక్కలేక మింగలేక అన్నట్టుగా బిత్తరపోతున్నారు. తెలుగు తమ్ముళ్లు మాత్రం జీవో లేకుండా అధికారులపై ఒత్తిడిచేయం సరికాదని వాదిస్తున్నారు. ఇంతకీ జనసైనికుల బాధ. అధికారుల వ్యథ ఏమిటంటారా? ఇది తెలుసుకోవాలంటే మంగళవారం కలెక్టరేట్, ఆ చుట్టుపక్కల కార్యాలయాల్లో జరిగిన సన్నివేశాల తెలుసుకోవాల్సిందే.

ఎన్నికలకు ముందు వరకు టిడిపికి ఉన్నంత బలం, నెట్ వర్కు మనకి ఉన్నాయా? అని సాక్షాత్తు తమ పార్టీ నాయకులను ప్రశ్నించిన పవన్, తాజాగా జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో నాలుగు దశాబ్దాల చరిత్రగల టిడిపిని నిలబెట్టగలిగాం అంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఆయన సోదరుడు నాగబాబు కూడా పార్టీ గెలుపు వెనక పవన్, ఓటర్లు తప్ప మరెవరూ లేరని చెప్పారు. దీంతో, టిడిపి సాయం లేకుండానే సొంత బలంతో గెలిచామని చెప్పుకున్నట్టు స్పష్టత ఇచ్చారు. దీంతో, తెలుగు తమ్ముళ్లు మళ్లగుల్లాలు పడుతున్నారు. ఇంకా ఈ వేడి చల్లారకముందే ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ ఫోటోలు పెట్టాలంటూ మంగళవారం జనసేన నాయకురాలు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ యశ్వసిని ఆధ్వర్యాన కలెక్టరేట్, ఆ చుట్టుపక్కల కార్యాలయాలకు జనసేన కార్యకర్తలు వచ్చి తమ అధినేత ఫోటోలు పెట్టాలంటూ ఒత్తిడిచేశారు. జిల్లా కలెక్టర్‌కు ఫోటో ఇచ్చారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలో కూడా వారే పెట్టేశారు. ఫోటోలు కూడా వారే తీసుకుని రావాడం గమనార్హం. దీంతో, ప్రజల్లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. జనసేన నాయకులకు అంత ఆత్రం ఉంటే జీవో తీసుకురావాలని పలువురు వాఖ్యానిస్తుండగా, ఎక్కడైనా, ఎప్పుడైనా సిఎం ఫోటో ఒక్కటి మాత్రమే ఉంటాయని, డిప్యూటీ సిఎం పదవి అనేది గౌరవార్థం ఇచ్చిన పదవే తప్ప, తప్పనిసరిగానీ, దానికి ప్రత్యేకమైన ప్రోటోకాల్‌గానీ ఉండబోవని మరికొందరు వాదిస్తున్నారు. అందువల్లే జీవో కూడా ఇవ్వలేదని చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో జనసేనకు అంత పలుకుబడి ఉంటే ఫోటో కోసం జీవో ఎందుకు తీసుకురాలేకపోతున్నారని కూడా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలకు సేవచేసే నాయకుడికి ఫోటోలతో పనేముంటుందని అంటున్నవారు కూడా లేకపోలేదు. మొత్తానికి ఫోటో పెట్టించడానికి జనసైనికులకు, పెట్టాలా? లేదా అన్నదానిపై అధికారులకు కష్టాలు



ఇపిఎఫ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షన్‌దారులు

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

పిఎఫ్ కార్యాలయం ముట్టడి

ప్రజాశకి-విజయనగరం టౌన్

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయనగరంలో ఉన్న పిఎఫ్ కార్యాలయాన్ని పెన్షనర్లు ముట్టడించారు. బిజెపి ప్రభుత్వానికో దండం అంటూ నిరసన తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి.శంకరరావు, కార్యదర్శి ఒఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇస్తామని బిజెపి ప్రభుత్వం నమ్మబలికిందన్నారు. పదేళ్లయినా పెన్షన్‌మాత్రం పెంచలేదన్నారు. పెరిగిపోతున్న ధరలు, వృద్ధాప్యంలో వచ్చే జబ్బులకు ఇప్పుడు ఇస్తున్న పెన్షన్ ఏ మూలకూ సరిపోవడం లేదన్నారు. దేశవ్యాప్తంగా ఇపిఎఫ్ 95 పెన్షనర్లు 78 లక్షల మంది పైగా ఉన్నారని, వీరి నుంచి 12 శాతం చొప్పున వసూలు చేసి కార్పస్ ఫండ్‌కు జమ చేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం నుండి రూ.14.866 కోట్ల రూపాయలు మాత్రమే పెన్షన్ రూపంలో చెల్లిస్తున్నారని వివరించారు. రైల్వేలో రాయితీలు పెన్షన్ దారులకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.శేషగిరి, కమిటీసభ్యులు ఆదినారాయణ, అప్పలరాజు, కె.రామారావు, కె.పాపారావు, పెన్షన్ దారులు పాల్గొన్నారు.

విఆర్ఓపై ఫిర్యాదు

పూసపాటిరేగ : మండలంలోని చోడమ్మ అగ్రహారం విఆర్ఓ గౌష్ పనితీరుపై ఆర్ఐ మాదురికి సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ ఆధ్వర్యంలో బాధితులు ఫిర్యాదు చేశారు. రైతులు నిరక్షరాస్యులు కావడంతో విఆర్ఓ సక్రమంగా సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. తమకు తెలీక ఏదైనా అడిగితే ఆగ్రహం వ్యక్తం చేస్తుందంటూ బాధితులు ఆర్ఐ ముందు గోడు విన్న వించుకున్నారు. ఈ విషయం పై అధికార్లుకు తెలియజేస్తానని ఆర్ఐ సమాధానం చెప్పారు. బాదితులు గురునాయుడు, లక్ష్మంనాయుడు ఉన్నారు.

కూలిన రైవాడ కాజ్‌వే

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామం నుంచి ఆనందపురం జంక్షన్‌కు వెళ్లే రోడ్డు మార్గం మధ్యలో రైవాడ జలాశయం కాలుపై ఏర్పాటు చేసిన కాజ్‌వే సోమవారం రాత్రి కూలిపోయింది. సుమారు రాత్రి 10 గంటల సమయంలో సిమెంట్‌తో వచ్చిన లారీ కాజవేపై నుంచి ప్రయణించడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఏ ఒక్కరికి ప్రమాదం జరగలేదు. గతంలో కాజ్‌వే కూలిపోయిన సమయంలో టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు తమ సొంత డబ్బులతో రాకపోకలకు ఆటంకం లేకుండా తాటి తొండలతోనూ, కలపవేసి వాటిపై కంకరవేసి తాత్కాలికంగా కాజ్‌వే వేశారు. ఇప్పుడు ఇది కూలిపోవడంతో ఐదు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాజ్‌వేను నిర్మించాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బల్లంకి గ్రామ ఉపసర్పంచ్ పల్లె ధనుంజయ, మాజీ సర్పంచ్ గొర్రె నాగరాజు, గ్రామ పెద్ద బల్లంకి కనకరావు, కోరారు.

విజయలక్ష్మికి సన్మానం

రేగిడి: మండలంలోని తాటిపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయులు గంగాడ విజయలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా మంగళవారం హెచ్ఎం రాంబాబు ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. ఎంఇఒలు ఎం.వరప్రసాదరావు, ఎర్రకయ్య ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం ప్రజలకు సేవా నిరతి కలిగి ఉండాలన్నారు. అప్పుడే మంచి పేరు ప్రఖ్యాతలు ఉంటాయన్నారు.

20న ఉద్యోగ మేళా

కొత్తవలస: ఈ నెల 20న స్థానిక ప్రగతి పాలిటెక్నిక్, ప్రగతి ఐటిఐ ఆధ్వర్యంలో వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వనుము శ్రీనివాసరావు తెలిపారు. డిప్లమోలో ఎలక్ట్రికల్, మెకానికల్ గ్రూపులు, ఐటిఐలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, పిట్టర్ ట్రేడులు చదివిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెస్యూమ్‌తో గురువారం ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

23న వివేకానందలో జాబ్ మేళా

శృంగవరపుకోట: ఈ నెల 23వ తేదీ ఆదివారం పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో విశాఖ ఎంపి మతుకుమిల్లి భరత్ ఆధ్వర్యంలో యువతి, యువకుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టిడిపి అధికార ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన బ్లూ ఓషన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఆదిభట్ల, కొంగర కలాన్‌లోని ప్రముఖ మొబైల్ కంపెనీలలో స్త్రీలకు, తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ప్రముఖ ఎసి కంపెనీ, కోల్గేట్ కంపెనీలలో పురుషులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన స్త్రీ, పురుషులు ఆధార్ కార్డ్, విద్యార్హత పత్రాలు, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ ఫొటోకాపీతో హాజరు కావాలని కోరారు.

ఇందిరమ్మ కాలనీలో బోర్లకు మరమ్మతులు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో పాడైపోయిన చేతిపంపు బోర్లను మున్సిపల్ అధికారులు బాగు చేశారు. కాలనీలో ప్రజలకు మంచినీరు అందించేందుకు ఐదు చేతిపంపు బోర్లను ఏర్పాటు చేశారు. ఐదు బోర్లు పాడైపోవడంతో మంచినీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో మున్సిపల్ అధికారులు మూడు బోర్లను మంగళవారం బాగు చేశారు. బోర్లు బాగు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన రెండు బోర్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సోలార్ రూఫ్‌టాప్ వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: సోలార్ రూఫ్ టాప్ వినియోగించుకోవాలని ఇపిడిసిఎల్ ఆపరేషన్ టౌన్ డిఇఇ పి.త్రినాధరావు కోరారు. మంగళవారం జరజాపు పేటలో సూర్య ఘర్ యోజన పథకంపై ఎపి ఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ అధికార్లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ సిస్టంతో విద్యుత్ పొదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సూర్యా ఘర్ యోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకి సూర్యా ఘర్ యోజన పథకం కింద రాయితీతో కూడిన రుణ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నగరపంచాయతీ వైస్ చైర్మన్ రామారావు, కౌన్సిలర్లు అవనాపు సత్య నారాయణ, కె. కళావతి, జనసేన నాయకులు నల్లి శేఖర్, ఎంఎం నాయుడు, ఎలక్ట్రికల్ ఎఇ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

విజయనగరం టౌన్ : నగరంలో వివిధ ప్రాంతాలలో ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు చేసిన ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది భారీ ఎత్తున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు అధిక మొత్తంలో జరిమానాలను విధించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది సంయుక్తంగా బొడ్డు కళావతి జంక్షన్, కొత్త అగ్రహారం, గాజులరేగ, పి.డబ్ల్యూ మార్కెట్ తదితర ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 490 కేజీల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకుని, జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించారు. అపరాధ రుసుము కింద రూ.49 వేలు మొత్తాన్ని విధించారు. ఈ దాడులలో పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతోనే గ్రామాభివృద్ధి

వేపాడ: గ్రామ సభలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎంపిటిసి తులసి అన్నారు. మండలంలోని బానాది రామకోవెల వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో గ్రామాభివృద్ధి చెందడానికి అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి వాటికి ఆమోదము తెలిపారు. ఈ గ్రామ సభలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లంపూడి ఎస్ఐ దేవిపై కేసు నమోదు

ప్రజాశక్తి - వేపాడ

వల్లంపూడి ఎస్ఐ బి.దేవిపై గుడివాడకు చెదిన రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇంఛార్జి ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. ఈనెల 11న గ్రామంలో జరుగుతున్న వేణుగోపాల స్వామి తీర్థ మహోత్సంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన వద్ద తన కుమారుడు మంచినీళ్లు తాగుతుండగా దౌర్జన్యంగా నువ్వు మాల కదా ఇక్కడ ఏం చేస్తున్నావ్ అంటూ దూషిస్తూ ఎస్ఐ కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఏ విధమైన తప్పూ లేకుండా కులం పేరుతో తిట్టడమే కాకుండా తమ కుమారుడుని ఎల్.కోట స్టేషన్‌లో నిర్బంధించి కొట్టారని ఫిర్యాదు చేశారని చెప్పారు.ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

గుడిసెకు నిప్పంటించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - భోగాపురం

వేరొకరి పూరిగుడిసెను ఉద్దేశ పూర్వకంగా కాల్చిన ఘటనలో సంబంధిత వ్యక్తిపై పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ సూర్యకుమారి అందించిన వివరాలు ప్రకారం. ముంజేరు పంచాయతీ ధనాలపేట గ్రామానికి చెందిన ధనాల నారాయణమ్మ గుడిసెలో నివసిస్తున్నారు. సోమవారం గుడిసెలో మంటలు చెలరేగి మొత్తం కాలిపోయింది. గుడిసెలో దాచుకున్న 50 వేలు నగదు, తులం బంగారంతో పాటు వస్తువులన్నీ కాలిపోయాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నారాయణమ్మ పేర్కొన్నారు. అంతేకాక అదే గ్రామానికి చెందిన ధనాల శీను అనే వ్యక్తి గుడిసెకు నిప్పుపెట్టి వెళ్లిపోతున్నట్లు తన మనవరాలు చూసిందని ఫిర్యాదులో పేర్కొనడంతో శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట వద్ద కొత్తవలస ఎక్సైజ్ ఎస్ఐ విఎన్ రాజు గస్తీ నిర్వహిస్తుండగా మంగళవారం వావిలపాడు గ్రామానికి చెందిన ఎల్లంకి దేవుడు ఐదు లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడు. అతనిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో హెచ్‌సిలు టిపిపిఎస్ ప్రసాదు, పి.వీర్రాజు, కానిస్టేబుల్ జి రమేష్, సెక్రటరీ టి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ ఛార్జీల రద్దుకు నిరసనలు

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ బిల్లులు తగ్గించి ట్రూ ఆఫ్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పాకివీధిలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తి లేదని చెప్పిన చంద్రబాబు నేడు విద్యుత్ ఛార్జీలు పెంచి ట్రూ ఆఫ్ ఛార్జీలు భారం వేయడం అన్యాయమన్నారు. ట్రూ ఆఫ్ ఛార్జీలను రద్దు చేసి విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: విద్యుత్ ఛార్జీలను పెంచి, ట్రూ ఆఫ్ ఛార్జీలను రద్దు చేయాలని జిల్లా వ్యవసాయ కమిటీ అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు మండల అధ్యక్షులు టి. వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గాడి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారన్నారు. అనంతరం కరెంటు బిల్లులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, వినియోగదారులు చంద్రిక,

బొబ్బిలి: విద్యుత్తు బిల్లులను దగ్ధం చేస్తున్న వినియోగదారులు

రామారావు, శ్రావణి, కనక, రాజ్యలక్ష్మి, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచమని చెప్పిన కూటమి పెద్దలు ఇప్పుడేలా పెంచారన్నారు. ప్రజలపై అధనంగా 1.40 లక్షల కోట్లు రూపాయలు భారం వేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జక్కాన రమణ, జక్కాన దేముడు, జక్కన సత్యనారాయణ, మహేష్, దావాల కన్నంనాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: విద్యుత్ ఛార్జీల పెంపు విషయంలో వైసిపి ప్రభుత్వం చేసిన తప్పే కూటమి ప్రభుత్వం చేస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ డిజిటల్ మీటర్లు ప్రజలకు భారమవుతాయన్నారు. ప్రజల జీవన స్థితిగతులను గుర్తించి విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గమ్మెల సన్యాసిరావు, తాడి చిన్నారావు, పాంగి నాగేశ్వరరావు, వంతల చిన్న తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: విద్యుత్ బారాలను మోయలేకపోతున్నామంటూ పూసపాటిరేగ విద్యుత్ బాధితులు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను తగ్గించాలని, దళితులతో పాటు ఇతర ఇళ్ళకు అత్యధికంగా విద్యుత్ బిల్లులు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ టొంపల సీతారాం, మందపాటి వాసు రాజు, మద్దతు తెలిపారు.

విద్యుత్తు ఛార్జీలు, సెకీ ఒప్పందాల రద్దుకు

గజపతినగరం, దత్తిరాజేరు : పెంచిన విద్యుత్తు ఛార్జీలను, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల విద్యుత్తు బిల్లులను

కొత్తవలస: ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, వినియోగదారులు

దగ్ధం చేశారు. దత్తి రాజేరు మండల కేంద్రంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూఅప్,, సర్దుబాటు ఛార్జీలు పేర రూ.15 వేల కోట్ల విద్యుత్తు భారాలు మోపారని తెలిపారు. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు..అధికారంలోకి వచ్చిన తరువాత అధిక భారాలు వేయడం దుర్మార్గమని అన్నారు. అవినీతితో కూడిన సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, సురేష్, బి.వెంకటరమణ, రాము, సరోజినీ, గౌరీ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు

గజపతినగరం మండలం బంగారంపేట గ్రామంలో సిపిఎం నాయకులు తెరలాపు కృష్ణ ఆధ్వర్యంలో కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ, అచ్చియమ్మ, కె.రాము, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.మెంటాడ మండలం కె.లింగాలవలస,సవరవల్లిలో సిపిఎం నాయకులు టి.సోములు ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులను దహనం చేశారు.

కలెక్టర్ ఆదేశించినా వినరా?

- జిల్లా మెజిస్ట్రేట్ మాట లెక్కచేయని ఆర్‌టిసి అధికారులు
- బడి బస్సు లేక విద్యార్థులకు అవస్థలు
- మినీ బడి బస్సు కోసం జోనల్ చైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి - వేపాడ

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది. ఆర్‌టిసి అధికారుల పనితీరు. ప్రభుత్వ విద్య బలోపేతానికి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలంటూ స్వయంగా జిల్లా కలెక్టర్ పలుమార్లు ఆదేశించినప్పటికీ ఆర్‌టిసి అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసిందని, దీని వల్ల వేలమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను విడిచి చదువులకు దూరమయ్యారని కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో ఆరోపణలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వ విద్య బలోపేతం కాకుండా ఇక్కడ ఆర్‌టిసి అధికారులే ఆటంకం కలిగించడం విస్మయానికి గురిచేస్తోంది.

ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుంచి వయా సోంపురం, జాకేరు, కరకవలస (గిరిజన గ్రామాలైన మారిక, వెంకయ్యపాలెం, పోతు బండిపాలెం) చామలాపల్లి, దబ్బిరాజుపేట మీదుగా బక్కునాయుడుపేట ఏపీ ఆదర్శ పాఠశాలకు బడి బస్సు ఉంటే, ఈ పాఠశాలతో పాటు మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కూడా విద్యార్థుల సంఖ్య పెరిగి ప్రభుత్వ విద్య బలోపేతం అయ్యే అవకాశం ఉంది. అందుకు ఒక ఆర్‌టిసి బస్సును ఈ రూట్లో నడపాలని 2022 సంవత్సరం నుంచి పలుమార్లు అర్జీలు పెడుతున్నప్పటికీ రూటు పరిశీలనకు వచ్చినప్పుడల్లా అధికారులు ఏదో ఒక కొత్త సమస్యను సాకు చూపి బస్సు నడపకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్‌టిసి అధికారులపై సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్ కోట డిపో మేనేజర్ స్పందిస్తూ ఈ విషయం తన పరిధిలో లేదని జిల్లా అధికారుల పరిధిలో ఉందని ఈ రూట్లో పెద్ద బస్సు తిరిగేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని మినీ బస్సు అయితే ఎటువంటి ఇబ్బందులూ ఉండవని చెప్పారు. కానీ ఎస్‌కోట డిపోలో మినీ బస్సు లేదని దాటవేత ధోరణి ప్రదర్శించారు.

పాఠశాల మూతపడే అవకాశం

ప్రస్తుతం బక్కునాయుడుపేటలో ఉన్న జిఎంసి బాలయోగి పాఠశాల, కస్తూర్బా పాఠశాలలలో హాస్టల్స్ సౌకర్యం ఉంది. కానీ ఏపీ ఆదర్శ పాఠశాలలో హాస్టల్ సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు వేరే ఇతర వాహనాల ద్వారా ఆదర్శ పాఠశాలకు రావాల్సిన పరిస్థితి. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. బడి బస్సు లేకుంటే రానున్న విద్యా సంవత్సరంలో ఏపీ ఆదర్శ పాఠశాలకు వచ్చే పిల్లలు సంఖ్య తగ్గి పాఠశాల మూతపడే ప్రమాదం ఉంది.

రావాడ ఈశ్వరరావు, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల, బక్కునాయుడుపేట

జోనల్ చైర్మన్‌కు వినతి

ఇక్కడ ఆర్‌టిసి అధికారుల దాటవేత ధోరణిపై ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్ను దొరకి వినతి పత్రాన్ని పంపించాను. ఈ గ్రామాలకు బస్సు కేటాయించాలని కోరాను. ఇప్పటికు మూడేళ్లుగా బడి బస్సు కోసం పోరాటం చేస్తున్నాను. ఎంతో మంది అధికారులను, చివరికి మంత్రి నారా లోకేష్‌ను కూడా కలిశాను. కలెక్టర్ ఆదేశించినా అధికారులు కొర్రీలు వేయడం బాధాకరం.

రూట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌టిసి అధికారులు (ఫైల్)

ఇప్పటికైనా అధికారులు స్పందించి బడి బస్సును ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య విపరీతంగా పడిపోయే ప్రమాదం ఉంది.

రిక్కి అప్పారావు, సామాజిక కార్యకర్త, వేపాడ

ఈ రూట్‌లో బడి బస్సు ప్రత్యేక అవసరం

పేద ప్రజలు, గిరిజనులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో ప్రత్యేకంగా బడి బస్సు నడపడం ఎంతో అవసరం. సేఫ్టీ పేరుతో కాలయాపన చేయకుండా అత్యవసరంగా మినీ బస్సునైనా ఏర్పాటు చేయాలి

జె. రాములమ్మ, తహశీల్దార్, వేపాడ.

మూడో రైల్వే లైన్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి- దత్తిరాజేరు

పెద్ద మానాపురం 3వ రైల్వే లైన్ బాధితుల కమిటీ ఆధ్వర్యంలో చిల్ల గోవింద నాయకత్వాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ధర్నా అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు, ఇల్లుకు బడ్జెట్ కేటాయించి ఇచ్చినట్లయితే బాధితులకు ఇళ్ల స్థలం కొనుగోలు చేయడం, కొత్తగా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. బాధితులు మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీన అధికారులతో మాట్లాడిన తరువాత మీరు స్పష్టమైన హామీ ఇచ్చారని, ప్రస్తుతం మాట మార్చడం సరైంది కాదని తెలిపారు. ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక బడ్జెట్ కేటాయించేటట్లు, దానికి తగ్గ చర్యలు తీసుకోవలసిన పూచి హామీ ఇచ్చిన బాధ్యత తహశీల్దార్‌దేనని బాధితులు స్పష్టం చేశారు. 100 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్న హామీని పక్కనపెట్టి మాట్లాడటం అంటే బాధితులను నిలువునా ముంచడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పనులకు ఎటువంటి ఆటంకమూ లేకుండా ఇల్లును కూల్చివేసి నిలువు నీడ లేకుండా చేసి ఇప్పుడు ఇళ్ల స్థలాలకు స్థలం కొనుగోలు చేయడంలో తహశీల్దార్ స్పష్టత ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాస్ తెలిపారు. అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని భవిష్యత్తు పోరాటానికి బాధితులు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఆ పోరాటాలకు అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గేదెల రామసత్యం, చిల్ల గోవిందా, డి.గణేష్, బి వెంకటరమణ, మొండి సతీష్, బోర మహేష్, ఎన్ గోవిందా, ఎం రాము, రాంబాబు, సరోజినీ, గౌరమ్మ, రామకృష్ణ పాల్గొన్నారు.

31లోగా క్లియర్ చేయాలి

విజయనగరం టౌన్: బిపిఎస్, ఎల్ఆర్ఎస్, దరఖాస్తుల పరిష్కారానికి ఈనెల 31 వరకు మాత్రమే గడువు ఉన్నందున తక్షణం వాటిని క్లియర్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో సంబంధిత కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా అన్ని పన్నులను వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. సమావేశంలో ఎసిపిలు హరిబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

బొబ్బిలి: మున్సిపాలిటీలో పన్నులు వసూళ్లకు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెలాఖరులోగా పన్నులు వసూలు లక్ష్యాలను చేరుకోవాల్సి ఉండడంతో కమిషనర్ రామలక్ష్మి, ఆర్ఒ నాగరాజు, ఆర్ఐ సురేష్, సిబ్బంది టీమ్‌గా పన్నులను వసూలు చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించాల్సిన వ్యాపారులను కలిసి పన్నులు వసూలు చేయడంతో పన్నులు చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు వస్తున్నారు. పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రులపై విశ్వాసం పెరగాలి

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు విశ్వాసం కలిగేలా వైద్య సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జీవనరాణి ఆదేశించారు. మంగళవారం ఆమె ఆరికతోట, రామభద్రపురం పిహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న పలు రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికలు, ఆన్లైన్ హాజరు పరిశీలించారు. రామభద్రపురం పిహెచ్‌సిలో నూతనంగా నిర్మించిన బ్లాక్, పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను పరిశీలించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో రోగులకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతీ నెల ఎన్నెన్ని ప్రసవాలు జరుగుతున్నది పరిశీలించారు. మాతా శిశు సంరక్షణ ప్రధాన ధ్యేయం కావాలని తెలిపారు. ప్రభుత్వం మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు పుట్టిన బిడ్డ ఆరోగ్య వంతంగా ఎదిగేందుకు ఉచితంగా ఇస్తున్న టీకాలు, ఇంజక్షన్లు, బూస్టరు డోసులు, రక్త హీనత తగ్గించేందుకు ఇచ్చే అన్ని రకాల మాత్రలు తల్లీబిడ్డలకు సమయానుకూలంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పిల్లి దిలీప్ కుమార్, అపర్ణ, సీసీ చంద్రశేఖర్రాజు, ఫార్మాసిస్ట్ కిషోర్, హెల్త్ సూపర్వైజర్ వాసుదేవరావు, ఎఎన్ఎం, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

పజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో స్వయంభూ శివాలయం అభివృద్ధికి గ్రామ సర్పంచ్, జనసేన నాయకులు కోట్ల రఘు మంగళవారం కమిటీ సభ్యులకు రూ. 1 లక్ష నగదు విరాళం అంది ంచారు. శివరాత్రి సందర్భంగా ఇటీవల రూ.2.50 లక్షలు అందించిన విషయం తెలిసిందే. గ్రామ పెద్దలంతా కలసి స్వయంభు శివలింగం ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యాలని నిర్ణయించారు. దానికి గానూ సుమారుగా రూ. 7 లక్షలు వరకూ ఖర్చవుతోందని అంచనా వేశారు. ఇందులో భాగంగా మంగళవారం లక్ష రూపాయలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘు మాట్లాడుతూ శివలింగం ప్రాంగణం శ్మశానంలో ఉందన్నారు. అక్కడ దేవాంగులు, విశ్వబ్రాహ్మణులు శ్మశానం ఉందన్నారు. ఆ శ్మశానంలో కొంత స్థలం శివాలయం అభివృద్ధికి తీసుకోవాలని నిర్ణయించామన్నారు. శ్మశానానికి సమీపంలో ఆక్రమణలో ఉన్న భూమిని శ్మశానానికి అభివృద్ధి చేస్తామన్నారు. శ్మశానం లోతులో ఉన్నందున మట్టి పిల్లింగ్ కూడా చేస్తామన్నారు. ఆయనతో పాటు గ్రామ పెద్దలు కోట్ల సత్యంనాయుడు, కోట్ల రామునాయుడు, సామంతుల సోంబాబు, లెంక రామకృష్ణ, లెంక రామునాయుడు, లెంక సురేష్, అల్లాడ త్రినాదరావు పాల్గొన్నారు.

సర్వేలు విజయవంతం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తాటిపాడు గ్రామంలో ప్రభుత్వ నిర్వహించిన పి-4, వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వేను శతశాతం నిర్వహించారు. ఈ సర్వేలు మంగళవారంతో ముగియడంతో ఆ సచివాలయ ఉద్యోగులు వీఆర్వో రమేష్, మరి కొంతమంది సిబ్బందిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. లక్ష్యాలను పూర్తి చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలను అవగాహన కల్పించడంలో ఈ సచివాలయ సిబ్బందికి అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పింఛను వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు ఇపిఎఫ్ పింఛన్ వెంటనే అమలు చేయాలని ఇపిఎఫ్ పింఛన్‌దార్ల సంఘం జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత 2 సంవత్సరాల నుండి రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు ఇపిఎఫ్ పింఛన్ అమలు కాలేదని తెలిపారు. ముఖ్యంగా జ్యూట్ యాజమాన్యం పిఎఫ్ కార్మికుల నుంచి విరుపుదల చేసిన బకాయి గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడంతో రిటైర్డ్ కార్మికులకు పింఛన్ అమలు జరగలేదన్నారు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రిటైర్డ్ జ్యూట్ కార్మికులు గ్రాడ్యూటీ బకాయిలు అందక, ఇటు పింఛన్ అమలు జరగకపోవడంతో పడరాని పాట్లు పడుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇపిఎఫ్ అధికార్లు రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు ఆన్‌లైన్ చేసి ఇపిఎస్ పింఛన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా పి ఎఫ్ బకాయి ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిన జ్యూట్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎలక్ట్రికల్ ఆఫీస్ వెనుక, రాజమహల్ ఏరియాలో సుదీర్ఘ కాలంగా బకాయి ఉన్న ఖాళీ స్థలములలో మంగళవారం అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మొండి బకాయి దారులపై పురపాలక సంఘ చట్టం అనుసరించి చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. పన్నులు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని ఆర్ఒ నాగరాజు, ఆర్ఐ సురేష్ అన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్మికులకు సరైన భద్రత లేదని సిఐటియు నాయకులు బి. సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విమానాశ్రయం నిర్మాణంలో స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కొన్ని వందల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కానీ వారికి భద్రత కల్పించడంలో నిర్మాణ సంస్థ విఫలమైందన్నారు. దీనికి ఉదాహరణ సోమవారం జరిగిన సంఘటనేనని తెలిపారు. బ్లాస్టింగ్ సమయంలో సరైన భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్లనే రామచంద్రపేట గ్రామానికి చెందిన బోర కొత్తయ్య రెడ్డి మృతి చెందాడన్నారు. దీనికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమన్నారు. మృతి చెందిన కొత్తయ్యరెడ్డికి రూ.50 లక్షలు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పని చేయించుకుంటున్న యాజమాన్యం కార్మికులకు అవసరమైన భద్రత సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు.

చెత్త సంపద కేంద్రం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని నందిగం పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి టి. వెంకటేశ్వర రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త పై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 21 నుంచి ఆరు రోజులు పాటు పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాలకు భోగాపురం మండల కేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరే మురళి, ఇంచార్జ్ ఎంపిడిఒ గాయత్రి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ వెంకటేశ్వరరావు

ఆదర్శ పాఠశాలను మరింత తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ ఆదర్శ పాఠశాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని స్టేట్ అకడమిక్ మోనటిరింగ్ అధికారి కె.ధర్మకుమార్ అన్నారు. మంగళవారం ఆయన సతివాడ ఆదర్శ పాఠశాలను సందర్శించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. పది, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రత్యేక తరగతులు నిర్వహించి నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలని సూచించారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడ్డ విద్యార్థులపై దృష్టి సారించి ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం జరగాలన్నారు. 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలు శతశాతం జరగాలని సూచించారు. విద్యా ప్రమాణాలు పాటిస్తూ ఆదర్శ పాఠశాలను మరింత ఆదర్శవంతంగా తీర్చి దిద్దడానికి అందరు సమిష్టిగా కృషి చేయాలను సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ హెచ్.శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఇఒ

నెల్లిమర్ల నగర పంచాయితీ

టెండర్ నోటీసు

ఆర్.సి. నెం.123/2024-ఇ1. తేది.18.03.2025

నెల్లిమర్ల నగర పంచాయితీ పరిధిలో 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టబోవు రోడ్లు మరియు కాలువల నిర్మాణ పనులకు మరియు 20 వార్డులలో పైపులైన్ లీకులను అరికట్టుటకు సాధారణ నిధులతో చేపట్టబోవు ఈ దిగువ చూపిన పనులకు tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లను ఆహ్వానించడమైనది.

మొత్తం పనులు :	4 పనులు (2nd Call)
మొత్తం అంచనా విలువ :	రూ. 9.50 లక్షలు
టెండర్ డాక్యుమెంట్లు అందుబాటు తేది మరియు సమయం:	తే. 19-03-2025 ది ఉదయం 10:30 గంటల నుండి
టెండర్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం:	తే. 02-04-2025 ది మధ్యాహ్నం 03:30 గంటల వరకు
టెండర్లు తెరచు తేది మరియు సమయం :	తే. 02-04-2025 ది మధ్యాహ్నం 04:00 గంటలకు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 1) కమీషనరు - 9177687657, 2) అసిస్టెంట్ ఇంజనీరు - 8520008977
ఇతర వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.

కమీషనర్(పూ.అ.భా),
నెల్లిమర్ల నగర పంచాయితీ.